# క్షంతవ్యులు!

శ్రీ "శండిల"

"భద్రాద్రి రాముడి దర్శనం రేపు చేసుకుందాం."

"అలాగే."

"సాయంకాలంవరకు చల్లగాలికి అలా వెళ్తారా? స్నానానికి వేన్నీళ్ళు పెట్టి వుంచుతాను బంగళాలో. పెందలకడనే వచ్చెయ్యండి."

"సరే."

"కొండలు,గుట్టలూను. దారీగట్రా బావుండదు."

పనిమీదగాని యాత్రార్థమైగాని భద్రగిరికి వచ్చిన ఎందరో ఉద్యోగుల్ని చూశాడు వీరయ్య. వారికి తాను నిర్ణయించుకున్న పద్ధతిలో సేవలువంటివి చేశాడు. కాని ఈయనలాంటి అధికారి అతడికి ఇప్పటివరకు దసులుబడలేదు. మధ్యాహ్నమనగా లాంచి దిగి వచ్చినప్పటినుంచీ ఆయన్ను అనుసరిస్తూ ఏవిధంగా తృప్తిపరచి మెప్పించగలనో అని లోతులు తీయడానికి తాపత్రయపడుతూనే వున్నాడు. పాతికేళ్లకుపైగా పాతుకుపోయిన వీరయ్య. వయస్సుతో పాటు అనుభవం గూడా ఆర్జించిపెట్టిన సత్తాను అతడికి ఎటువంటి అధికారినైనా ఇట్టే తనదారికి మళ్ళేట్లు చేసేది. ఈయన విషయంలో అది మారడం లేదు. ఉద్యోగము హోదాకు సంబంధించిన ఆరాలు ఎంత తీద్దామని ప్రయత్నించినా అంతు చిక్కడంలేదు. ఇంతకు ఆయన ఎందుకిక్కడకు వచ్చినట్లో గూడా ఇతమిత్థం తేలలేదు. పోతే ఆకొద్ది ఘంటలలోను ఆయన వెలువరించిన—అచటి గోదావరీతీరం, పరుపుగా పరచబడ్డట్లున్న గళుకు మెరుగు ఇసుక ఉపరితలం, ఆలయ ప్రాంగణానికి దారితీసే పావంచాలు, చలనంలేని పహారాజవాన్లను గుర్తుకు తెస్తూ నిలబడ్డ చింతలు—ఇటువంటివాటిని కూర్చిన భోగట్టా వీరయ్యకు కావలసిన అంశాన్ని అందనిచ్చిందిగాదు. దీన్నిగురించి పదేపదే ఆలోచిస్తూ ఆ ముసలిబంట్రోతు బంగళావైపు నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇంక ఆయన—చరచర ముందుకు పోతూనే వున్నాడు. అప్పుడప్పుడు భుజంమీది బొచ్చుతువ్వాలుతో నుదుటను గ్రమ్మే చెమట బిందువుల్ని వొత్తుకుంటున్నాడు. ఆయన నడచేదాన్ని దారి అనడానికి వీల్లేదు. బండలు, వాటిమధ్య పల్లాలు—ఇంకా కొంచెం ముందుకుపోతే ఎడమచేతివైపు నూరుగజాల దూరంలో నిత్యమూ ప్రవహించే పావనగౌతమీ నదితో స్నేహం కలిగి నిరంతరము ప్రొద్దుపుచ్చే, కుడివైపున నిటారుగా ఆకాశంలోకి ఎగబ్రాకడానికి ఉత్సాహపడుతున్న మెట్టలు... ఆయన బూటుకాళ్ళ క్రింద పడి నలిగిపోయే రాలిన యెండుటాకులు మర్మర ధ్వనులు చేస్తున్నాయి. సంజ సమీపిస్తున్నా గ్రీష్మ ఋతువు ఆఖరి పాదపు ఎండ - మరి అది ఆషాఢపు చివరి చురుకు కదూ! - చర్మాన్ని ఉడికిస్తూనే వుంది.

ముందుకు చకచక సాగివచ్చిన ఆయన గమనం అనుకోకుండా ఆగిపోయింది. ఆయన సమీపించింది కూడలి మాత్రం కాదు. ఏ కారణం చేతనైనా కావచ్చు- అక్కడి కొండకోనకు త్రోవతీసేటట్లు పరచి వుంచబడ్డాయా అనే భ్రమ గొల్పే ఎండుటాకుల నిడుపాటి ప్రోవులు ఒక కొసనుండి అంటుకొని చిటచిటలాడుతూ కాలుతున్నాయి. పాంథులు విసరి పారేసిన - చివర కొద్దిపాటి నిప్పుతో మిలిగి వున్న సిగరెట్టు ముక్క - లేదా దూరాన్నుంచి ఎగిరివచ్చిన నిప్పురవ్వ - కనీసం కృత్తికాపవనానికి ఒండొంటి ఘర్షణ ఫలితంగా చెట్ల కొమ్మలనుండి పుట్టిన అగ్ని కావచ్చు-ఏదైనా చాలు అక్కడ మంటలు పుట్టించడానికి. విషవాయువు పొగలు వ్యాపించినట్లు, నీలివార్తల పుకారు పాకినట్లు, అంటువ్యాధి ప్రాకినట్లు, ధ్వనులు పయనించినట్లు మంటలు మింటికెగబ్రాకడానికి చిరునాలుకలు చాస్తూ క్రమంగా కొండకొమ్ముల చేరుకోవడానికి పోటీపడుతున్నాయి. అది ఒక మహారణ్యమేమో! పొగల సెగలు నలుదిశల గ్రమ్ముకుంటున్నాయి. చీకటిలో అదే దృశ్యాన్ని ఆయన చూచివుంటే అంధకార బంధురమైన అనిశీథిని దుర్భేద్యమైన దుర్గాన్ని అధిరోహించడానికి కాగడాలతో ఎగబ్రాకే సేనల బారుల వెలుతురులు దృష్టిపథంలో మెదిలివుండేవి.

ఆయనకు ఆ మంటలను ఇంకా చూడాలనిపించింది. ముందుకేపోతూ చెట్ల నడుమ తిష్ఠ వేసుకొని కలకాలం కాపురం చేయాలని ఉబలాట పడుతోందా అన్నట్లు తోచే ఉష్ణతీష్ణత తనను తాకితే ఎలాగుంటుందీ? శారీరకంగా మానసికంగా అనుభూతి ఎటువంటిది? సంఘానికి, సమాజపుకట్టుబాట్లకు ఎదురీదడానికి ప్రయత్నించి లంఘింప జూచే తరుణవయస్కుని విప్లవ భావవీచుల్ని తాను అక్కడ పొందగలడా?

సాహసించి ఆయన ముందుకు పోగలిగేవాడే. కాని అలాగ జరుగలేదు. తుప్పలను డొంకలను దగ్ధం చేసి చెట్లకొమ్మలమీదికి ఎక్కడానికి తీవ్రపడే అగ్ని తాకిడినుంచి బయటపడాలని స్వీయప్రాణ రక్షణార్థం కొట్టుమిట్టాడే కొన్ని అడవిజంతువుల దురవస్థ ఆయన్ను ఆకర్షించి నిలిపివేసింది. ఆ డొంకనుంచి ఈ కంచెకు గెంతిన కుందేలు అక్కడికంటె ఇక్కడి వేడి హెచ్చు కావడంచేతనేమో ఉక్కిరిబిక్కిరై ప్రక్కనున్నది అగాధమైనలోయ అయినా భయపడక దానిలోకి ఉరికేస్తోంది. ఉడుకుబాధకు తాళలేని ఉడుము చల్లదనంవైపు పోవాలనే ప్రగాఢ వాంఛతో ఇంకా మంటలవైపే ఉడాయించడం చూచి ఆయన నవ్వుకున్నాడు. మెట్టతాబేళ్లు అటు ఇటు చురుగ్గా జరగడంలో మంటలు ఎంత చప్పుడు చేస్తున్నా—ప్రాణంకోసం అలమటించే వీటి జరజరలు కూడా స్పష్టంగా వినిపిస్తున్నాయి. రెండు ముంగిసలు వేడెక్కిన రాళ్ళ పైభాగంనుండి జారలేక ఒళ్ళు కాల్చుకున్న వాటిని ఆయన చూశాడు. అల్లంత దూరానవున్న దృశ్యం ఆయన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. రెండు చిరుమానులు ఒకమద్ది నిటారుగా మహా వృక్షాలుగ పెరిగి కొద్దిపాటి నీడను పరివ్యాప్తం చేయడానికి ప్రయాసపడుతున్నాయి. ఆ ఛాయలో పైనున్న ఆకాశంలో విహరించే మొయిలు కన్నెను చూచి పురివిప్పి నృత్యం చేయడానికి విజృంభిస్తున్నదొక నెమలి. దాని కింకా దూరాన్నుంచి ముంరుకు దూసుకువస్తున్న మంట లవుపించలేదేమో! లేక ఆ ఋతువులో దాని కంత ధీమా వుంటుందేమో! అయితే ఒక్కటిమాత్రం జరిగింది. ఈ మంటలనుండి తన్ను రక్షించుకోవడానికి శరవేగంతో ముందుకు ప్రాకిన కాలసర్పమొకటి—ఆరాటంలో తాను నిల్చున్నది తివ శత్రు స్థావరమని గమనించి వుండకపోవచ్చు—కించిత్కాలం ఆ మద్ది చెట్టుక్రింద నెమలి పింఛం మాటున నిలబడ గల్గింది. పరిస్థితి జీవుని పెట్టే ఒత్తిడి అలాంటిది!

క్షణంసేపు ఈ ప్రకృతి సౌందర్యాన్ని ఒకవంకనుండి చూచిన ఆయన మరొక వైపుకు మరలిపోక తప్పిందిగాదు. సూర్యుడస్తమించడానికి ఇకనొక గంటకన్న ఎక్కువ సమయం వుండదు. ఆయనకు ఒడలంతా చెమట పట్టింది. వేడివల్లను పొగచేతను నల్లనిరంగు అదొకలాగున ఆయనమీద కప్పుకుంది. బొచ్చు తువ్వాలు భుజమ్మీద నేవున్నా, అప్పటివరకు రెండుమూడు దఫాలు దాన్ని ఆయన ఉపయోగించి వున్నా ఇప్పుడది ఆయన ధ్యాసలో లేదు. తాను క్షణం క్రితం తిలకించిన దృశ్య ప్రభావము—విపత్కర వాతావరణంలో తగుల్కొని దాని చీకాకుకు తట్టుకోలేక కొట్టాడుతున్న—ఘనంగా ఒకనాడు బ్రతికిన మహా సమాజపు దురవస్థను ఆయన దృష్టిపథంలో నిల్పి వివిధమైన భావాల్ని ఉత్పన్నం చేసింది. తత్ఫలితంగా ఆయన తన స్వస్థతను కొంతవరకు కోల్పోయాడని చెప్పవచ్చు.

వెనక్కు మళ్ళడంలో గూడా తీవ్రత నే కనబరచి నందువల్ల ఆయన అనుకోనంత త్వరగా నది వొడ్డుకు చేరుకోగలిగాడు. ఇంతలోనే ఆకాశంలో మేఘం గూడా ఆయనకు సానుభూతి ప్రకటిస్తున్నట్లు ఎండకు తెరగప్పింది. వచ్చి వచ్చి ఆయన పెట్టబడినది గాక పుట్టినట్లేవున్న గోడను మరపించే ఒక నల్లరాతి బండవార దాన్ని ఆనుకొని ఓరగా ఒక ప్రక్క నిలబడిపోయాడు. అనుకోకుండా అక్కడ చదికిలబడిపోయాడు. చెక్కిన నల్లని శిలా వితర్దికవలె భూమిపై శాశ్వతంగా పడివున్న ఒక బండదిమ్మమీద ఆయన నిడుపాటి తన బొచ్చుతువ్వాలును పరచుకొని మోచేతులను ఆ ఫలకానికి ఆనించి అరచేతులలో మోపబడ్డ గడ్డం ఆధారంపై తన కట్టెదుట తనను పులకింపజేస్తున్న దృశ్యాన్ని చూస్తూ బోరగిల పడుకొని వున్నాడు. గోదావరిపై నుంచి చల్లని పిల్లగాలి అలే వచ్చింది.

## 2

గోదావరీ తీరంలోని ఆ భాగం ఆమెకు సుపరిచితమై వుండవచ్చు. ప్రతిరోజూ అదే సంజవేళ ఆమె అక్కడకు స్నానానికి వస్తూవుండాలి. తనకుతక్క మరొకరికి ఆ తావు ఏ విధంగాను గుర్తింప నసాధ్యమై

వుండి వుండాలి. కనీసం ఆ చోటు అట్టిదనే ధీమాయైనా ఆమె పుంజుకొని వుండాలి. లేకుంటే ఆ తరుణి స్నానపద్ధతిలో ఆ స్వేచ్ఛ, ఠీవి, హుందాతనం, సౌందర్యం మూర్తీభవించి వుండేవి కావు; ఎంతో ఆలోచన చెయ్యగల ఆయన్ను అంత త్వరగా ఒక భావవీధిలోంచి మరొక రీతిలోకి లాక్కు రాగలిగేవి గావు. ఆమె కిన్నెరసానీ గాదు; వనదేవతా కాదు— మరే గంధర్వకన్య అనుకోడానికీ ఆస్కారంలేదు. ఆమె అచ్చంగా ఒక పడుచుపిల్ల. అంతకు మించి అతి దగ్గరగా సూక్ష్మంగా సూటిగా చెప్పగల శక్తిమంతమైన మాట మరొకటి దొరకడం కష్టం. పోల్చడానికైతే ఎన్నైనా ఊహాలు పుడతాయి: ఆ క్షణంవరకు కలత నెరుగని సరస్సు, అతి నిర్మలమైన మనస్సు. కడిగిన ముత్యం. చిదిమి పెట్టిన దీపం. అందాన్ని పుణికి పుచ్చుకొన్న యౌవనం. అరణ్యంలో కొండ కొమ్ము నుండి ఆషాఢంలో కురిసిన వర్షానికి వాగులు నింపుకొచ్చిన క్రొత్తనీటితో నిండుజవరాలివలె తొణికిసలాడి గట్లు నొరసికోవడానికి ఉరకలుపెట్టే గోదావరి. మరి ఇట్టి మగువ అట్టి మగవానికి అవస్థాభేదం కలిగించడంలో ఆశ్చర్య మేముంటుందీ. నీళ్ళలోనే అక్కడక్కడ చిత్రంగా పేర్చబడినట్లున్న బండలపై కూర్చుని అటు ఇటు గునుకుతూ, ఒకచో వయ్యారంగా సబ్బుతో వొళ్లు తోముకుంటూ లీలగా ఖేలగా తన లేత చేతులతో నీళ్ళు భుజాలకంటా విసురుకుంటూ ఆమె అలా ఎంతసేపు జలక్రీడ సాగించిందో-ఎంతటి మహా సౌందర్యవంతమైన లతకైనా ఒక ఆశ్రయం లేనిదే శోభించదుగదా! అడవిలోని కొండమల్లెవలె, కొండలోని సెలయేటివలె, ఏటిస్వచ్ఛమైన నీటిబిందువు వలె ఆ సౌందర్యానికి సార్థక్యం అన్నది ఎక్కడ? దాన్ని ఎవరుచూచి ఆనందించను? ఒకవేళ దాన్ని ఎవరైవా చూచినా అది జరిగినట్లు ఆమె గుర్తించినా మరుని మేషంలో సంభవించే పరివర్తనవల్ల జనించిన భావపరిణామ మెలావుంటుందో వేరే చెప్పనక్కర లేదు. ఆమెస్నానం ముగించుకొని వుండవచ్చు. సహజమైన చనవుతో మెట్లు నెక్కినట్లు ఒడ్డునవున్న బండలదగ్గరకు వస్తోంది. కొద్ది సమయంలో ఆమె వొళ్ళు తుడుచుకుంటుంది. నిడుపాటి వెంట్రుకలుగల జుత్తును పిడపెట్టుకొనే అలవాటున్నదో లేదో—పాతికేళ్లకు పైదాటని పడుచుదనం తనలో రెక్కలిప్పే వింతవింత భావాల త్రొక్కిడికి తట్టుకోలేక ఆయన లేచి నిల్చున్నాడు. ఆయన శరీరం ఇంకా స్వస్థత నొందలేదు. కాళ్ళు అప్రయత్నంగా వెనక్కు నడిచాయి. చప్పుడు చెయ్యకుండా ఆయన రెండుమూడు బండల ప్రక్కకు ప్రాకిపోయాడు ఎక్కడ నక్కివున్నా ఆయనమాత్రం ఆమెకు కనబడగూడదు. ఆమె మటుకు తనకు కనపడాలి. ఓహో! ఎంతటి బలవత్తరమైన దీవాంఛ! విధీ ఆయనకే అనుకూలించింది.

ఆమె తనవస్త్రాల్ని విప్పుకొని పోగుగా పెట్టుకొనివున్న స్థలానికి వచ్చింది. ఒక్కమారు నలుకెలంకులా కలయజూచింది. ఆమాపు క్రొత్తది. అది ప్రసరించిన కోణమే వేరు. ఇవన్నీ స్పష్టంగా దూరాన్నుంచి ఆయన ఆమెకళ్లలో చదువగలుగుతున్నాడు. అనుకోనట్లు ఆమె క్రొత్తమాపుకు ఒకక్రొత్త వస్తువు అనింది. అనడమే తడవు ఆమెలో విపరీతమైన భావాలు వింతవింత భంగిమలలో విచిత్రలాస్యం ప్రారంభించాయి. లేత గులాబిరంగులోవున్న ఆమెనునుమెత్తని పాదాలు ఆయన బొచ్చుతువ్వాలుపై పడ్డాయి. ఈ తుండు ఎవరిదీ? ఇక్కడి కెలా వచ్చిందీ? ఇది స్త్రీల దానికివలె కనబడ్డంలేదే! మరి దీనియజమాని ఎవరు? లేక తనభ్రమగాని ఇది తానిక్కడకు రావడానికి చాలాసేపటిక్రితమే వుండిపోయినదేమో! పరంపరలుగా ప్రశ్నలు ఆమెను తికమక పెడుతున్నాయి. వీటికి ఆక్షణంలో సమాధానం రావడం దుర్లభం. కారణం ఆమె అక్కడ ఎవ్వరున్నారని వాటికి తన ఎర్రని పెదవులద్వారా వ్యక్తీకరణం ఇవ్వగలదు? అనిర్వచనీయమైన మౌనంచేత పరిభ్రమించబడ్డ ఒకవిచిత్ర విన్యాసం! దీన్ని దూరంనుంచి చూస్తూ ఆయన తనలోనుండి తొట్రుపడుతూ పెల్లుబికి వెలికిరావడానికి విశ్వప్రయత్నంచేసే హాస్యాన్ని బలవంతంగా ఆపుచేసుకున్నాడు. తనకు తెలియకుండా ఆస్త్రీ ఎంతటి అవివేకాన్ని ప్రదర్శిస్తోందీ! లేకుంటే ఏమాత్రం ప్రపంచ జ్ఞానం కలిగిన యువతియైనా నీళ్ళనుండి బయటకు రాగానే చేయవలసిన పనేనా అది? తత్క్షణం ఆమె పాముకుబుసాన్ని మరపించే వాయిలుచీర శరీరమంతటా కప్పుకొని వుండవలసింది. త్వరలో ఒళ్ళు తుడుచుకొని బట్టలు సరిగా కట్టుకొని ఇంటిమొగమై ప్రయాణం ప్రారంభించి అప్పుడు—కావాలంటే ఇటు అటు విలాసానికి లేదా ఎదైనా తెలుసుకోడానికి చూడవచ్చు. కాని ఇక్కడ అదేమీ జరగలేదు. అయితే ఒకటిమాత్రం చెప్పాలి.

ఆమెకంటె లేదంటే పదేళ్లు ముందుగా ప్రపంచంలో అడుగుపెట్టిన ఆయన - విద్యాధికుడు గూడా కావచ్చు —తన నిర్ణయాలనే గీటురాయిపై ఆ అమాయికపు మేలిమి బంగారాన్ని గీచి వుండవలసింది గాదు. అదైతే గీటుకు సరిగానే వస్తుంది. కాని పరిశీలకుని అంచనా వాస్తవానికి కొంచెం దూరంగా వుంటుంది. ఇందులో దోషమెవరిదీ లేదు.

ఆమెది యౌవన తీవ్రత. దాని ముమ్మరానికి ముందు వెనుకలు లేవు. ఎట్టి దిట్టలైనా ఆ అవస్థలో అంధులే. అక్కడ మనం అనుకొన్న ప్రమాణాలేమీ పని చెయ్యవు. అది గర్వం. దాని తీవ్రతకు అవధులుండవు. వేగానికి లెఖ్ఖ కట్టడం కష్టం. అది మనిషి చేత ఇప్పుడు ఈ పని ఇలాగ చేయిస్తుందని ఇంతవరకు ఇతమిత్థంగా చెప్పగలిగిన వాడెవ్వడూ లేడు. ఒకవేళ వున్నానని ముందుకువచ్చినా వారిమాటలు నమ్మ వీలు లేదు. కనుకనే ఆమె అలాగు చేసింది. ఎలుగెత్తి పిలుద్దామని పిలువలేకపోయింది. ఇంకాముందుకు సాగి చుట్టుప్రక్కల చూద్దామని చూడలేకపోయింది. 'ఈ వస్తువు ఎవరిదో—దీనిగొడవ మనకెందుకు?' అనుకొని దానిని వదిలివేద్దామని ఒకటికి పైగామార్లు స్థిరీకరించుకొని గూడా ఆమె ఆ తువ్వాలును తీసి పైన కప్పుకోకుండా వుండలేకపోయింది. మనిషికి పతనం అనేది ఎప్పుడు ఏ మూలనుండి ఎలాగ సంభవిస్తుందో ఎవరూ చెప్పలేరు.

ఆ పిల్ల ఆ బొచ్చు తువ్వాలుతో ఒళ్ళంతా శుభ్రంగా తుడుచుకొంది. అంతటితో ఆగాలా! జుట్టును దానికి పిడిపెట్టి అనేకవిధమైన వయ్యార మొలికించేటట్లు మెలిద్రిప్పి తలపై తెల్లని మల్లెపువ్వులను కుప్పగా తురుముకొన్న కొండదేవతవలె ధరించింది. ఇంక తర్వాత ఆమె ఏంచేసిందో ఆయనకు సరిగా తెలియదు. కారణం సూర్యుడు వీరిరువుర పరిస్థితిని చూడలేక సిగ్గుపడ్డాడా అన్నట్లు తన ముఖాన్ని పశ్చిమ దిశారాణి ఒడిలో దాచుకోవడమే. ఆమె చకచక తన నివాసం వైపు నడుస్తోంది. పాతిక గజాలదూరం ఎడంలో ఆయన ఆమెను అనుసరిస్తున్నాడు. ఎవరైనా ఆయన్ను ఆ క్షణంలో చూసి ఎందుకీయన ఈ పడుచువెంట పడ్డాడు? అని శంకించుకుంటున్నందుకుమాత్రం ఆయన ఆ పని చెయ్యడంలేదు. ఊరికి కొంచెం దూరంలో గాలి ధారాళంగా వీచే స్థలంలో నిర్మింపబడ్డ గిరిజనుల నూతన నివాసస్థానాలలో ఆమె వసతివుంది. దాన్ని ప్రభుత్వంవారు ప్రణాళిక పనులలో ఒక భాగంగా నిర్మింపజేశారు. అప్పటి గిరిజనుల సేవకని కొందరు అధికారులను, సంఘసేవికలను నియమించి ప్రత్యేక శాఖగా ఆ పని నిర్వహిస్తున్నారు. ఆమె గది తలుపు తాళంతీసింది. కనుచూపు మేరలోనే ఆగి ఆయన అనినంతవరకు ఆ గదిని చూస్తున్నాడు. అది ఒక్కరే వుండడానికి అనువుగా కట్టబడ్డ గదులకోవకు చెందినది. లోపలికి ప్రవేశిస్తూనే ఆమె తలుపు గడియ వైచుకొంది.

## 3

కొద్ది క్షణాలు మౌనంగా నడిచాయి. ఆమె ఎన్నడు విననటువంటి నూతన ఫక్కీలో తన తలుపు బయటనుంచి తట్టబడడం గుర్తించింది. ఆ స్వరం అధికార పురస్కృతమైనది. అవతలి వ్యక్తి తన మాట, ముల్లె ఏదో లోపల వుండిపోయినట్లు దబదబ బాదుతున్నట్లు ధ్వనిస్తోంది. ఆమె చరాలున తలుపు తెరచింది. ఎదుటనున్న వ్యక్తిని చూచింది. ఆయనా ఆమెను చూశాడు. కొన్ని సెకన్లు మాత్రమే వారి మధ్య మౌనంగా నిలబడగలిగాయి.

"ఎవరు మీరు? ఎవరికోసం వచ్చారు?" అదిరిపడేటట్లు ఆమెనుండి వచ్చింది ప్రశ్న.

"నేనే నండి. ప్రత్యేకమైన పనివుండి వచ్చాను" ధీమాయే ప్రత్యుత్తరంగా ఆయననుండి వెలువడింది.

"ఆ పనేమిటో తెలుసుకోవచ్చునా?" ఈ ప్రశ్నగూడా విరసంగానే వచ్చి ఆయన్ను ఘాటుగా తాకింది.

"నా వస్తువు ఒకటి ఈ ఇంటిలోకి వచ్చింది. దయవుంచి దాన్ని ఎక్కడ వున్నదో వెదకి తీసుకొనవెళ్ళనివ్వండి" ఇది జవాబు కాదు; రెట్టించిన ధీమా.

ఆమె కణత పగిలినంత పనయ్యింది. జలజంతుని అరచేతి దెబ్బకు పళ్ళు కదలిన బలహీనుని ముఖం ఆమెలో ద్యోతకం కావడానికి ప్రయాసపడింది. అయినా ఆమె ఆడది. అసమానమైన స్త్రీ - తన మార్పును తానే ధైర్యంగా సంబాళించుకోడానికి ప్రయత్నించి "మీరనేది నా కర్థం గావడంలేదు. డొంకతిరుగుడు దారివదలి సూటిగా చెప్పండి. మీకు ఏమి కావాలో? ఈ స్థలంలో ఈ సమయంలో ఇక్కడ పురుషులకు ప్రవేశం నిషిద్ధం!"

ఆయన పకాలున నవ్వడానికి ప్రయత్నించాడు. కాని మందహాసం మాత్రం చెయ్యగలిగాడు. మరి

ఎదుటి మనిషి గుర్తించుకోనగలిగితే ఆపాటి ప్రహారం చాలు. "వస్తువును అపహరించినవాళ్ళు తమ నేరాన్ని తాము అంగీకరించక పోగా దాన్ని కప్పి పుచ్చుకోవాలని చూచేటప్పుడు ప్రశ్నలకు సూటిగా సమాధానాలు రావు. ఇవ్వకూడదుగూడా. అందునా ఈ సందర్భంలో అసలే పనికిరాదు. మళ్ళీ అడుగుతున్నా. దేవీ! మీరెవ్వరో నాకు తెలియదు. మీతో నాకేమీ పని లేదు. తెలిసిగాని తెలియక గాని లేదా కొంచెం ప్రయోజనం కాంక్షించి వుండిగాని మీరు నావస్తువును తీసుకొన్నారు. ఈ సరికి దాని ఉపయోగం గూడా పూర్తియై వుంటుంది కనుక వెంటనే నాబొచ్చు తువ్వాలు నాకిచ్చివెయ్యండి." ఆయ నింకేమీ మాట్లాడలేదు. ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేదు. విజేత వలె అచంచలంగా నిలుచున్నాడు.

అప్పటివరకు ఆమెను ధైర్యంగా నిలబెడతామని భరవసా యిచ్చిన ఆమె ఊహాసౌధంలోని పునాదులు తునాతునకలై పోతున్నాయి. హిమానీ నదాల ప్రవాహంలోని మంచుబండరాలవలె తేలిపోతున్నాయి, 'ఇప్పుడేమిటి చెయ్యడం? పాదాలపై వ్రాలి ఆయన్ను క్షమించండి అని ప్రార్థించడమా? నేను తప్పుచేశానని గొంతెత్తి ఏడ్వడమా?'— 'ఛా! ఇదేమిటి? ఇంతమాత్రానికే బేలవై పోతావేం? కించిత్కాలం ఒకరి వస్తువు నాదని వాడుకొన్నావు. యజమానులు దాన్ని అడుగుతున్నారు. వెంటనే ఇచ్చేసి బూజులు దులుపుకొని శుభ్రంగా అలికి ముగ్గుబెట్టుకున్న మందిరాంతర్భాగం వలె నీ హృదయాన్ని చక్కబరచుకో'—

'ఇది నీవనుకొన్నంత తేలికపని కాదు. అది కేవలం ఒక తుండుమాత్రమే కాదు. జరిగినపని నీవు తీసుకోవడమేనా? కాదే. అది వర్ణనాతీతమైనపతనావస్థ. నీవు చూచిందాన్నే ఇతమిత్థమని పోల్చుకోలేక పోతున్నావు మరి నీవు చూడకుండా ఎంతగ్రంథం జరిగిందో ఎరుగుదువా— నా కళ్ళతో చూడనిదాన్ని నేను నమ్మను. దాని ప్రమేయం నేను పెట్టుకోను—అనే ఆధునిక యువకులవలె దీన్ని త్రోసి పారెయ్యగలవా? అసాధ్యం'—

జీవితంలో ఎన్నడు ఎదుర్కొనియుండనటువంటి తీవ్రఘర్షణకు తట్టుకోలేక ఆమె తూలిపోతోంది అతిప్రయత్నంపై వణకుతున్న దేహంతో ఆమె ఒక్క పనిమాత్రం చేయగలిగింది. తడిసిన తువ్వాలును ఆయనచేత బెట్టింది. "క్షమించండి" అందామనుకొని పెదిమలదాకా ఆమాటవచ్చినా సాహసించి ఉచ్చరించలేక పోయింది.

"మంచిది. ప్రస్తుతానికి సెలవు యిప్పించండి రాముడు మేలుచేస్తే మళ్ళీ కలసుకొందాం." మధురాతిమధురమగు స్వరంలో దివ్యవీణపై భవ్యఫణితులు పలికినట్లు అని ఆయన తువ్వాలు భుజమ్మీద కప్పుకొని చీకటిలో బంగాళావైపు వెళ్ళిపోయాడు ఆమె వెంటనే తలుపు వేసేసుకొంది దీపం ఆర్పేసింది. రాత్రి కింకేమీ తీసుకోలేదు; పచ్చిమంచినీళ్ళైనా పుచ్చుకోలేదు. కుప్ప కూలినట్లు మంచంపై పడిపోయింది. శాంతికోసం నిద్రకోసం ఘూర్ణిల్లింది. నిద్ర పట్టలేదు రాత్రి గడచిన కొద్దీ ఆమెను ఏదో పెనుభూతం ఆవహించినట్లు భయపడసాగింది. దిగులుపడ్డది; ఖేదపడ్డది. ఒకవ్యక్తి తాను నిలుచున్న మహోన్నతశృంగ శిఖరంనుండి విధివశాన క్రిందకు బలంగా త్రోయబడడంవల్ల పొందిన పాటువలన గలిగేబాధను ఆమె తెల్లవార్లూ భరించింది.

ఆయన బంగళాకు చేరుకొనేసరికి ఎనిమిదిగంటలైంది. వీరయ్య కాచిన వేన్నీళ్ళుపోసుకొని బట్టలు మార్చుకొని క్యారియర్ లో తెచ్చిన అన్నం భోజనంచేసి మంచంపై మేనువాల్చాడు. బాగా అలసివుండడంవల్ల ప్రయాణపు బడలికవల్లను చావగొట్టి పారేసినట్లు ఆయనకు ఇట్టే నిద్రపట్టేసింది. ఒకజాము సుఖసుప్తి అయినాక స్వప్నంలో స్వచ్ఛంగా సాయంత్రపు దృశ్యాలు తారాడ్డం మొదలుపెట్టాయి. లాంచి దిగడం. వీరయ్యదర్శనం. గోదావరీతీరం. పావంచాలు. కొండదోవ. అంటుకొన్న ఎండుటాకులు. అడవిజంతువులు. బండరాతిపక్క పడుచుపిల్ల స్నానం. ఒక్కటొక్కటే అతివేగంగా కదలిపోతున్నాయి: తిరిగి తిరిగి అవే దృశ్యాలు కలలో నిజాలవలె కనబడుతున్నాయి. కొండగాలి మళ్ళింది. గోదావరిపైనుండి చల్లగా బంగళామీదికి పవనం దాడివెడలింది. బంగళాఆవలి ప్రక్కన నారత్రాటికి వ్రేలాడగట్టబడి ఆరవేయబడ్డ బట్టలకోసన వున్న నిడుపాటి బొచ్చుతువ్వాలు ఆ గాలికి కొద్దిగా కదులుతోంది. నిద్రలో దానికీ స్వప్నంవచ్చినట్లు ఆ తలపు సుడుల్ని తలచుకొని ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నట్లు ఆ కదలిక చెప్పక చెబుతోంది.

## 4

మరునాడుదయం ఆయన రామ దర్శనం చేసుకున్నాడు. వీరయ్య పొందదలచిన భోగట్టా చాలవరకు లభించింది. ఆయనది కాకినాడట. ప్రణాళికాశాఖలో జిల్లా అధికారులందు ఆయన కూడా ఒకరు. ఇవాళ సాయంత్రం జరుగనున్న గిరిజనాభ్యుదయశాఖవారి కార్యక్రమానికి—వార్షికోత్సవాలకు అధ్య

భారతి

క్షతవహించేందుకు, బహుమతి ప్రదానానికి ప్రత్యేకంగా ఆహ్వానింప బడ్డారు.

సాయంత్రంవరకు ఆయన తమ పాతమిత్రుల కొందరను, ప్రభుత్వోద్యోగులను కలసుకొని సంతోషంగా గడిపివేశారు. వారందరు ఉత్సవాలకై ఆహూతులలో వున్నారు. సరిగా అయిదుగంటలకు గిరిజనాభ్యుదయ శాఖవారివల్ల నిర్మింపబడ్డ మండపంలో ఉత్సవం ప్రారంభమయింది. ఆయనే దాని కధ్యక్షులు. స్థానికాధికారులు వారిని పుష్పమాలాలంకృతుల్ని గావించి ఘనంగా సన్మానించారు. తరువాత విచిత్ర వేషధారణ పోటీలు, నృత్య గేయ రూపకాలు జరిగాయి. ఇక మిగిలింది బహుమతి ప్రదానం. ఆటపాటలలో తదితర కార్యక్రమాలలో తమ ఘనత సూచించుకొన్న వారికి పేరు పేరున బహుమతులు పంచిపెట్టబడుతున్నాయి. అక్కడి అధికారి ఒకరు ఆయన కూర్చొన్న కుర్చీ ప్రక్క నిలబడి పేరులవారీగా ఆయావ్యక్తులను వారి విశిష్టతలను సభవారికి పరిచయం చేస్తున్నారు. వారు ముందుకువచ్చి సాదరంగా ఆయనకు నమస్కరించి బహుమతు లందుకొని వెడుతున్నారు. కరతాళధ్వనులు సభనుండి బయలువెడలి మిన్నుముట్టుతున్నాయి. చాలా పేర్లు చదువబడ్డ తర్వాత ఈ వాక్యాలు దూరశ్రవణ యంత్రాలద్వారా సభలో ప్రతిధ్వనిస్తున్నాయి. “కుమారి శోభారాణి. ఈమెనుగురించి సభవారికి నేను కొన్ని వాక్యాలు మనవిచేస్తున్నందుకు గర్విస్తున్నాను. ఈమె సహజంగా పుట్టింది కోయగడ్డపైన. మంటిలోంచి బయల్పడ్డ మాణిక్యంవలె, వనంలో దేవత వెలసినట్లు, గిరిజనులలో గిరిజాకుమారివలె ఈమె అవతరించింది. పువ్వు పుట్టినప్పటినుండి పరిమళం వెదజల్లేటట్లు చిన్ననాటినుండి ఈమెలో ప్రతిభ వెల్లివిరిసింది. ఆంగ్లము తెలుగు బాగుగా అభ్యసించి బి. యే. పరీక్ష యిచ్చింది. నిస్వార్థ సంఘసేవ చేయాలని తనకు వచ్చే ఉద్యోగాల్ని, హోదాల్ని వదలుకొని సాటి మానవుల సంక్షేమానికి అవిరళకృషి జరుపుతోంది. వివాహం చేసుకోకుండా ఈ క్షణంవరకు బద్ధకంకణయై తన సౌశీల్యమనే సౌరభంతో ఈ గిరిజన ప్రాంతాన్నంతను ముగ్ధపరుస్తున్న ఈమె సంఘ సేవాభావానికి, శీలసంపదకు మేము ప్రత్యేకంగా బహూకరించే స్వర్ణపతకం చూస్తే ‘చంద్రుని కొక నూలుపోగు’ అన్న లోకోక్తి జ్ఞప్తికివస్తుంది.........”

ఇంకా ఆయన ఏదో చెబుతూనే వున్నారు. ఆ మాటలు వినడంకంటే సభలోంచి ఎవ్వరూ ఆ పతకాన్ని అందుకోవడానికి ముందుకు రాకపోవడం అధ్యక్షులవారి ఆశ్చర్యాన్ని ఇనుమడింపచేసింది.

ఆయన నిశ్చేష్టులై సభనంతా కలయజూచారు ‘ఏరీ-- ఒకరూ ముందుకురారే! ఈ పతకం గానీ అగ్ని విస్ఫులింగంవంటిదా? ఎవ్వరూ దీన్ని తాకనేలేరా? అహో! ఈ శోభారాణి ఎవరు? ఇంతకీ ఆమె ఈ సభలో ఉన్నట్లా లేనట్లా?’ మౌనంగా ఆయన చూపులే సభవారిని ప్రశ్నిస్తున్నాయి.

“లేవాలి. శోభారాణి ముందుకు రావాలి. ఈ పతకాన్ని అందుకోవాలి” అధ్యక్షుల ప్రక్కనున్న అధికారి గరిస్తున్నాడు. ఔను మరి. ఆయన చూచినంతవరకు అది తనకు గర్వకారణమైన విషయం.

మరి ఆమె - అంటే ఆముందువరసని కూర్చొన్న నాల్గవవారు కడన లేచినిలుచున్న వనిత- ఇప్పటివరకు ఎంతసేపటినుండి ఏ ఏ మార్గాల ఏ ఏ కోణాల ఏ ఏ భావాలతో అధ్యక్షులను చూచి ఎలా సిగ్గుపడిపోతున్నదో! అవి అధికారుల పరిచయ వాక్యాలా? మీకు కావచ్చు. నాకు కావచ్చు. అందరికి వినసొంపుగావచ్చు. కాని ఆమెకో వెన్నవంటి మెదడుపై బలంగా వేయబడుతున్న సమ్మెట వ్రేటులు. నవనీత కోమల హృదయాన్ని తూట్లు పొడిచే శూలాలు. ఈ ప్రహారాలకు ప్రతిగా ఒక్కొక్క మాటకు ఒక్కొక్క వేడి కన్నీటి బిందువు మినహా ఆమె ఆ క్షణంలో మరి దేనినీ బహిర్గతం చేయలేక పోతోంది. ఆమె చేయగలిగిందల్లా ఒక్కటే. లేచి నిలబడింది. అంతే మళ్ళీ కూర్చుందామనుకున్నా కూర్చోలేదు. ఒక్క అడుగైనా ముందుకు వెయ్యడానికి ఆమెకు శక్తి చాలదు. ఆసంకల్పానికి మనస్సే ఊతనియ్యక పోతే ఆమెశరీరం ఇంకెలాగ కదలగలుగుతుంది?

“తన ఆరాధ్య దైవము ప్రత్యక్షమైనాడని తెలిసికూడా భక్తుడు ఆయనను చేరలేకపోయాడు. ఇంతకన్న నేరం ఏమి వుంటుంది?”

అధ్యక్షులు ఆమెను పరీక్షగా చూశారు. శోభారాణి స్వరూపాన్ని ఆయన గుర్తించారు. ‘సరే ఈ పతకాన్ని తర్వాత ఆమెకు అందజెయ్యండి. చిన్నతనంవల్ల కావచ్చు, ఆమె తాను ఏం చేస్తున్నదీ తెలియక సిగ్గుపడుతున్నది” అన్నారు. బహు ప్రయాసపైన ఆమె కూర్చోగలిగింది. ఆకూర్చోవడం గురువు నెదుట తప్పునొప్పుకొని కూర్చొనే శిష్యుని, ప్రభువు నెదుట మోకరిల్లి పాపానికి పశ్చాత్తాపం ప్రకటించే భక్తుని అధ్యక్షుల విజ్ఞప్తికి తెచ్చింది.

“నన్ను క్షమించండి!” అని ఆమె పరిదీనవదనయై ఆయన్ను బ్రతిమాలుతున్నట్లు తోచింది.

ఆయన హృదంతరాళంలో ఈ ప్రశ్న ప్రతిధ్వనించింది, “అయితే నేనెవ్వరికి క్షమాపణ చెప్పుకోవాలి????”